క్లుప్తంగా

ప్రజావాణికి అధికారుల గైర్హాజరు


హాజరైన అధికారులు, సిబ్బంది

ఝరాసంగం(జహీరాబాద్): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. ఝరాసంగం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి ఏర్పాటు చేశారు. అన్నిశాఖల అధికారులు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ పలు శాఖల అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. సోమవారం ఉ. 11:00 దాటినా పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కాలేదు. పూర్తిస్థాయిలో హాజరయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అమ్మవారికి వెండి అభరణాలు


అభరణాల అలంకరణలో అమ్మవారు

నారాయణఖేడ్: పట్టణ శివారులోని మనూరు క్రాస్‌రోడ్డు సమీపంలోని లలితాంబికదేవి అమ్మవారికి ఆలయ వ్యవస్థాపకులు శ్రీపంతులు, అమ్మవారి భక్తబృందం సోమవారం నాలుగు కిలోల వెండి అభరణాలు సమర్పించారు. అభరణాలను అర్చకులు మలమంచి గురుజ్యోషి అమ్మవారికి అలంకరించారు. నగల అలంకరణలో అమ్మవారి విగ్రహాన్ని చూసి భక్తులు భక్తిపారవశ్యం చెందారు.

సెలవుల్లో స్కూల్ నడపొద్దు

నారాయణఖేడ్: దసరా సెలవుల్లో విద్యాసంస్థలు నడపకుండా అధికార యంత్రాంగం చూడాలని అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి తెంకటి కుమార్ కోరారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించినా కొన్ని చోట్ల కార్పొరేట్ విద్యాసంస్థలు నడుస్తున్నాయన్నారు. విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తూ సెలవులు అమలయ్యేలా చూడాలన్నారు. లేని పక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థలపై ప్రత్యక్ష దాడులు చేస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా, డివిజన్ బాధ్యులు సుధీర్, ప్రేమ్‌దాస్, రామ్, పవన్ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సుజాత

నారాయణఖేడ్: బాలబాలికలకు పోషకాహారం చాలా అవసరమని ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాత అన్నారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోషణమాస అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిరుధాన్యాలతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. పోషకాహారలోపంతో తలెత్తే పరిణామాలు, కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. ఏసీడీపీఓ సుశీల బాలలహక్కులు, పోక్సోచట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టంపై సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మహేశ్‌కుమార్, డీహెచ్ ఐడబ్ల్యూ ఎస్ఎఫ్ఎల్ నర్సింహులు, అధ్యాపకులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పన జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సింగూరుకు వరద



పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ప్రతి రోజు వానలు కురుస్తుండటంతో ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో చేరుతుంది. దీంతో 7 క్రస్టుగేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టులోకి 52735 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 17 టీఎంసీలను నిల్వ ఉంచి అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

బాలా త్రిపురసుందరీగా అమ్మవారు

జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం మొదటి రోజు దుర్గాదేవి బాలా త్రిపురసుందరీగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, అభిషేకం, మహానైవేద్యం, కుంకుమార్చన నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. దేవీ శరన్నరాత్రులతో ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.


జహీరాబాద్‌టౌన్: శ్రీమాణిక్‌ప్రభు మందిరం వద్ద


జిన్నారం(పటాన్‌చెరు): భద్రకాళి ఆలయంలో..


నారాయణఖేడ్: బాలాత్రిపుర సుందరీగా దర్శమిచ్చిన అమ్మవారు


ఝరాసంగం: మంగళ గౌరీ దేవిగా దుర్గామాత దర్శనం..


సదాశివపేట గురునగర్ కాలనీలో..


సంగారెడ్డి టౌన్: దుర్గామాతగా వాసవీ కన్యక పరమేశ్వరి


రామచంద్రాపురం: భెల్‌కాలనీలో

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు: మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్‌గూడ సిద్ధార్థ ఎన్‌క్లేవ్ కాలనీలో మాజీ ఎంపీపీ దేవానందం రూ.5 లక్షల సొంత నిధులతో నిర్మించ తలపెట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధికి ప్రతీకగా పటేల్‌గూడను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నితీశా శ్రీకాంత్, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజం కోసం పోషణమాసం


అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు

పోషణ అభియాన్ జిల్లా సమన్వయకర్త సౌమ్య

పటాన్‌చెరు టౌన్: ఆరోగ్య సమాజం కోసం పోషణ మాసాన్ని నిర్వహిస్తున్నట్లు పోషణ అభియాన్ జిల్లా సమన్వయకర్త సౌమ్య అన్నారు. సోమవారం పటాన్‌చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'పోషణ మాసం' పేరుతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు బలహీనంగా ఉండడం వల్ల చదువుపై దృష్టి సాధించలేకపోతున్నారని అన్నారు. మరో వైపు యుక్త వయసు బాలికలు రక్తహీనత, ఇతర అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బాలల సంరక్షణ సమస్యలు, డ్రగ్ నిర్మూలన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యాంటీ డ్రగ్ ఎడ్యుకేటర్ హప్రియ, బాలల సంరక్షణ అధికారి లింగం, కళాశాల ప్రిన్సిపాల్ మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా


ప్రభుత్వాసుపత్రి ఎదుట నిరసన చేస్తున్న కార్మికులు

సంగారెడ్డి: ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్పిటల్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ హాస్పిటళ్లు, కాలేజీల్లో పనిచేస్తున్న పేషెంట్ కేర్, శానిటేషన్, స్వీపర్ సెక్యూరిటీ గార్డ్స్, సమస్యలు పరిష్కారం కావట్లేదన్నారు. హాస్పిటల్‌లో మూడు నుంచి నాలుగు మాసాల పాటు వేతనాల బకాయిలు ఉన్నాయన్నారు. కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే పెండింగ్ జీతాలు ఇవ్వాలని మండిపడ్డారు. యూనిఫామ్, షూ బెల్ట్ తదితర వాటి కోసం రూ. 2000 వరకు జీతంలో కట్ చేసుకుంటున్నారని , వాటిని ఆపి ప్రభుత్వమే సప్లై చేయాలన్నారు. చట్టం ప్రకారంగా లెబర్ డిపార్ట్‌మెంట్ ఉత్తర్వుల ప్రకారం సెలవులు అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల ఐక్యం చేసి ప్రభుత్వంపై పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాదగిరి, శోభ, రమాదేవి, సదానందం, సునీత, భాగ్యలక్ష్మి, నాగరాజు, మల్లేశం, వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు న్యాయం చేయండి


వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం సర్వే నంబర్ 1, జంగంపేట 376 బాధిత రైతులు తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ... గత ప్రభుత్వం హెచ్ఎండీఏ పేరిట రైతుల నుంచి 180 ఎకరాలు భూమిని స్వాధీనం చేసుకుంది. పరిహారం కింద ఎకరాకు 600 గజాల స్థలాన్ని కేటాయిస్తూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆర్డీఓ చేతులమీదుగా పట్టాలు అందజేశారు. నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు పొజిషన్ చూపలేదు. దీంతో రైతులు ఉన్న భూమిని కోల్పోయి.. పరిహారం అందక దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఈ మేరకు హెచ్ఎండీఏ పరిధి నుంచి టీజీఐఐసీకి బదిలీ చేసి బాధిత రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. తమ భూములు తమకు అప్పగించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పరిశ్రమలకు కేటాయించిన భూముల్లో నుంచి అక్రమంగా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించడాన్ని నిలిపివేయాలన్నారు. లోతువాగులో నిర్మిస్తున్న అక్రమనిర్మాణాలపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెంకటేశం గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, బండి శ్రీకాంత్ గౌడ్, రమేష్, శ్రీధర్ గౌడ్, రైతులు విట్టల్, నర్సింగ్‌రావు, వెంకటేష్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంగారెడ్డి: వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అదనపు కలెక్టర్ మాధురికి సోమవారం వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఆమెను కలిసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌యాదవ్ కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షానికి నష్టపోయిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. అలాగే రైతులకు ఎకరానికి రూ. 50 వేలు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. వర్షంతో పాడైన కుంటలు, ఆనకట్టలు బాగు చేయాలని కోరారు . కార్యక్రమంలో జగన్ ,నరేష్, మహేష్, సురేష్, రైతులు పాల్గొన్నారు.

తోపుడు బండిపై వచ్చి.. ట్రై సైకిల్‌పై వెళ్లి..


తోపుడు బండిపై వస్తున్న దివ్యాంగుడు నగేశ్


ట్రై సైకిల్‌పై వెళ్తున్న నగేశ్

సంగారెడ్డి జోన్: లగ్దారం గ్రామానికి చెందిన నగేశ్ దివ్యాంగుడు తోపుడు బండిపై ఇబ్బందులు పడుతూ వచ్చి.. ట్రై సైకిల్‌పై చిరునవ్వుతో తిరుగు ప్రయాణం అయ్యాడు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ట్రై సైకిల్ ఇప్పించాలని అధికారులతో కోరాడు. కొన్ని సంవత్సరాలుగా పింఛన్ తీసుకునేందుకు ఇతర పనులకు ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. స్పందించిన అధికారులు వెంటనే అతడికి ట్రై సైకిల్ ఇప్పించారు. దీంతో నగేష్ హర్షం వ్యక్తం చేస్తూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

జనరేటర్ ఏర్పాటు కృషి చేస్తా

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్, ఫార్మాసిస్ట్ భీంరావు

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ ఆస్పత్రిలో జనరేటర్ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రిలో జనరేటర్ ఏర్పాటు చేయాలని సోమవారం ఎమ్మెల్యే ప్రభాకర్‌కు ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయశంకర్, ఫార్మాసిస్ట్ భీంరావుపాటిల్ వినతిపత్రం అందజేశారు. జనరేటర్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో కలశయాత్ర


కలశయాత్రలో మహిళలు, స్థానిక నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో దేవీ నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన మహిళలు సోమవారం కలశ యాత్రను చేపట్టారు. కలశయాత్రకు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. భక్తిశ్రద్ధలతో తలపై కలశాలను ధరించి స్థానిక దుర్గామాత ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ అనిల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ గోపాలమ్మ, ఆలయ కమిటీ సభ్యులు దీనానాద్ రాజారాం, శ్రీమన్నారాయణ, జై సింగ్, విజయ్, కార్మిక నాయకులు లఖన్, మా అంబి మహిళా సేవా సమితి సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

పురుషుల కంటే మహిళలే అధికం


ఓటర్ జాబితాలను పరిశీలిస్తున్న అధికారులు

మునపల్లి(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల్లో 33,928 మంది ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ గంగాభవాని తెలిపారు. 17,151 మంది స్త్రీలు, 16,722 మంది పురుష ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. పురుషుల కంటే 429 మంది మహిళలు అధికంగా ఉన్నారని అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం 41 మంది బూత్ లెవల్ అధికారులు ఉన్నారు. మండల కేంద్రంలో బూత్ లెవల్ అధికారులతో మృతి చెందిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగించే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఒకే కుటుంబం వేర్వేరు వార్డుల్లో ఓట్లు ఉంటే వారిని ఒకే వార్డులో ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బూత్ లెవల్ అధికారులు ఓటర్ లిస్టు జాబితాలో మృతి చెందిన వారి పేర్ల తొలగింపుతో పాటు రెండు చోట్ల పేర్లు ఉన్న వారిని గుర్తించి ఒకే దగ్గర ఉండేలా నమోదు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

బలవంతంగా భూసేకరణ చేయొద్దు


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): పరిశ్రమల పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేయొద్దని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాణిక్యం ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల పరిధి మునిదేవునిపల్లిలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ.. మునిదేవునిపల్లిలో సర్వే నంబర్ 92లో 293 ఎకరాల భూమిని 277 మంది సాగు చేసుకుంటున్నారని తెలిపారు. రైతులకు జీవనాధారంగా ఉన్న భూమిని పరిశ్రమల పేరుతో ప్రభుత్వం బలవంతంగా తీసుకుంటుందని అభివృద్ధి కోసం భూములు తీసుకుంటే 2013 భూ సేకరణ చట్ట ప్రకారం రైతులకు మార్కెట్ విలువకు మూడింతల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఉద్యోగం కల్పించాలని, పాస్ పుస్తకాలు ఉన్న, రికార్డుల్లో లేని రైతులకు కూడా నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాజయ్య, నాయకులు అర్జున్, శ్రీనివాస్, మాణయ్య, రామచందర్, శ్రీను, కమల్ రెడ్డి, నర్సింలు, లక్ష్మారెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

జెన్‌కో డైరెక్టర్‌ను కలిసిన నేతలు


బాల్‌రాజ్‌ను సత్కరిస్తున్న నాయకులు

జహీరాబాద్: జెన్‌కో డైరెక్టర్ పిల్లి బాల్‌రాజ్‌ను జహీరాబాద్, కోహీర్ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జహీరాబాద్ ప్రాంత సమస్యల గురించి వివరించారు. రాష్ట్ర జెన్‌కో చీఫ్ ఇంజనీర్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం జెన్‌కో డైరెక్టర్ పదవిని ఇచ్చింది. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఎల్.జనార్దన్, బి.రాచయ్య, అష్రఫ్‌అలీ, చాంద్‌పాష తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మోటారుకు మరమ్మతులు**

పుల్‌కల్(అందోల్): మండల కేంద్రం పుల్‌కల్‌లో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం వద్ద సింగిల్ ఫేస్ మోటారుకు మరమ్మతులు చేశారు. కొన్ని రోజులుగా మరమ్మతుకు నోచుకోకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. ఆత్మ కమిటీ డైరెక్టర్ విఠల్ జోక్యం చేసుకొని మరమ్మతు చేయించారు. తాగునీటి సమస్య తీరడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

◆ **రోడ్డుకు మరమ్మతు చేయించండి**

సంగారెడ్డి: జహీరాబాద్ మండలం హుగ్గేల్లి గ్రామానికి వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే మరమ్మతులు చేయించాలని కోరుతూ పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ సోమవారం అదనపు కలెక్టర్ మాధురికి వినతిపత్రం సమర్పించారు. సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ రోడ్ల మరమ్మతులు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

◆ **డీసీఎం బోల్తా, ఇద్దరికి గాయాలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): డీసీఎం బోల్తా పడి క్లీనర్, డ్రైవర్‌కు గాయాలైన ఘటన మండలంలోని గొల్లగూడెం శివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం .. మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వైపు మెడిసిన్ లోడ్‌తో వెళ్తున్న డీసీఎం అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొని రోడ్డుకు అవతలి వైపు బోల్తా పడింది. దీంతో కొంత మేర ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ప్రమాదంలో క్లీనర్, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

◆ **పందుల యజమానులకు నోటీసులు**

నారాయణఖేడ్: మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు సోమవారం శానిటరీ అధికారి శ్రీనివాస్ మున్సిపాలిటీ పరిధిలోని పందుల యజమానులకు నోటీసులు అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో సంచరిస్తున్న పందులను వారం రోజుల్లోగా పట్టుకుని జనావాసాలు లేని ప్రాంతాలకు తరలించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. లేని పక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ **ఘనంగా బతుకమ్మ సంబరాలు**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో సోమవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలని మహిళలు పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. అనంతరం బతుకమ్మను నిమజ్జనం చేశారు.

◆ **వెయ్యి మందితో హనుమాన్ చాలీసా**

సదాశివపేట(సంగారెడ్డి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం సా.7 గంటలకు పట్టణంలోని గాంధీచౌక్ వద్ద 1000 మందితో హనుమాన్ చాలీసా సహస్ర గళార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాల నాయకులు తెలిపారు. సహస్ర గళార్చన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలన్నారు.

◆ **బూచినెల్లిలో భారీ వర్షం**



జహీరాబాద్ టౌన్: మండలంలోని బూచినెల్లి ప్రాంతంలో సోమవారం భారీ వర్షం కురిసింది. గ్రామ పరిధి పోతులవాగు వర్షానికి పొంగిపొర్లడంతో జహీరాబాద్- బూచినెల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పనుల కోసం పట్టణానికి వెళ్లి వారు గ్రామానికి వచ్చేందుకు అవస్థలు పడ్డారు. గ్రామం నుంచి జాతీయ రహదారి వరకు ఉన్న రోడ్డు పెద్దపెద్ద గుంతలు పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. భారీవర్షం కారణంగా గుంతల్లో నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఇటీవల గ్రామానికి కలెక్టర్ ప్రావిణ్య వచ్చిన సందర్భంగా గ్రామస్తులు దెబ్బతిన్న రోడ్డును బాగు చేయాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.